విశాలాంధ్ర
అల్లూరి సీతారామరాజు
పేజి నెం. 8
సోమవారం 15, డిసెంబరు 2025

గజగజ వణికిస్తున్న చలి...

విశాలాంధ్ర-డుంబ్రిగుడ : మండలంలోని తీవ్రమైన కప్పబడిన మంచుతో చలి గజగజ వనికిస్తుంది. దీంతో మండల కేంద్రవాసులు ఉదయం బయటకు రావాలన్న చలి దెబ్బకు భయపడుతూ రాలేకపోతున్నారు. తప్పని పరిస్థితుల్లో వచ్చిన తీవ్రమైన చలి ఎక్కువగా ఉండటం వల్ల తట్టుకోలేక మంటలు పెట్టి అగ్గి కాస్తున్నారు. తీవ్రమైన పొగ మంచు ఉండి చలికి తట్టుకోలేక అనేకమంది మండల కేంద్ర వాసులు ఉదయం బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. ఏది ఏమైనా చలి తీవ్రత ఎక్కువగా ఉండటం వల్ల ఉదయం బయటకు రాలేక నివాసగృహాల్లోనే ఉండవలసిన పరిస్థితి ఏర్పడింది. ఉదయం చలి తీవ్రత ఎక్కువగా ఉండడం వల్ల అగ్గి మంటలు పెట్టి అగ్గి కాయక తప్పడం లేదు.

అభివృద్ధికి ఆమడ దూరంలో మేజర్ పంచాయతీ పాడేరు

- పంచాయతీ కాలువలు పరిశుభ్రం చేయించలేని పంచాయితీ సర్పంచ్
- మంచినీటి సమస్యతో అల్లాడుతున్న ప్రజలు

పాడేరు మండల తెదేపా ప్రధాన కార్యదర్శి దన్నెటి పాలసీ సురేష్ కుమార్

విశాలాంధ్ర-పాడేరు : అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు కేంద్రం మేజర్ పంచాయతీ ప్రజలు సమస్యలు పరిష్కరం కాకా సతమాతమవుతున్నారని పాడేరు మండల తెదేపా పార్టీ ప్రధాన కార్యదర్శి దన్నెటి పాలసీ సురేష్ కుమార్ అన్నారు. ఆదివారం ఆయన సుంద్రుపుట్టు ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు వివిధ సమస్యలు తన దృష్టికి తీసుకువచ్చారనీ. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ఉన్న మేజర్ పంచాయతీలో ప్రధానంగా మంచినీటి సమస్య వెంటాడుతుందని అనేకమార్లు పంచాయతీ అధికారులు జిల్లా స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఈ సమస్య పరిష్కారంలో విఫలమవుతున్నారని, సుంద్రుపుట్టు, లోచల పుట్టు, బక్కులపనుకు, చాకలిపేట, గుడివాడ, గొందూరు గ్రామాల్లో మంచినీటి సమస్యతో తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారన్నారనీ. అలాగే ఆయా గ్రామాల్లో మురుగు కాలువలు దర్శనమిస్తున్నాయని, దాంతోపాటు ప్రధాన కూడలి వద్ద పంచాయతీ అధికారులు చెత్తకుండీలు నిర్మించకపోవడంతో ఎక్కడబడితే అక్కడ చెత్త కూరుకుపోయి దుర్వాసన వెదజల్లుతూ ప్రజలు అనేక రోగాల పాలవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సుంద్రు పుట్టు గ్రామంలో ఇనుప కరెంటు స్తంభాలతో ప్రజలు భయాందోళనలు చెందుతున్నారని, ఆయా ప్రాంతాల్లో ఇనప స్తంభాలు తొలగించి సిమెంట్ స్తంభాలు నిర్మించాలని ఈ సందర్భంగా విద్యుత్ శాఖ అధికారులను కోరుతున్నామన్నారు. అలాగే వివిధ ప్రాంతాల్లో మురుగు కాలువలు, చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయని అది వెంటనే పంచాయతీ అధికారులు తొలగించాలనీ డిమాండ్ చేశారు. మేజార్ సర్పంచ్ గా గెలిచి మరల స్థానిక సంస్థ ఎన్నికలు వస్తున్నప్పటికీ ప్రజా సమస్యలు సర్పంచ్ కు పట్టలేదని అన్నారు. పంచాయతీ అభివృద్ధికి ఏమాత్రం పంచాయతీ సర్పంచ్ కృషి చేయలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు గమనించాలని ప్రజా సమస్యలు పరిష్కారం ఎవరు చేస్తారు అటువంటి నాయకులను ప్రజలు ఎన్నుకుంటే మంచిదని హితవు పలికారు. మన సమస్యలు పక్కనపెట్టి వారి స్వలాభాల కోసం ఆరాటపడే నాయకులను గెలిపించుకుంటే మన ప్రాంతాలు అభివృద్ధికి ఆమడ దూరంగానే ఉంటుందని అన్నారు. వచ్చే స్థానిక సంస్థ ఎన్నికల్లో ప్రజా సమస్యల పరిష్కారం చేసే సరైన నాయకులను ప్రజలు ఎన్నుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ట్రావెల్ బస్సును సీజ్ చేసిన చింతూరు పోలీసులు

విశాలాంధ్ర-చింతూరు : పరిమితికి మించి బస్సులో ప్రయాణికులను ఎక్కించుకొని రవాణా చేస్తున్న బస్ ను చింతూరు ఎస్సై రమేష్ శనివారం రాత్రి సీజ్ చేశారు. వివరాల్లోకి వెళితే ఒడిశా రాష్ట్రం నుండి కుంట మీదుగా ఆంధ్రప్రదేశ్ లోని చట్టి జంక్షన్ నుండి విజయవాడ వెళుతుండగా చట్టి వద్ద ఎస్సై తనిఖీలు నిర్వహించారు. సంగీత ట్రావెల్స్ కు చెందిన బస్సులో 110 మంది

ప్రయాణికులు ప్రయాణించటం గమనించి బస్సును సీజ్ చేశారు. నిబంధనల ప్రకారం 35 మంది బస్సులో ప్రయాణం చేయాల్సి ఉంది. అయితే ఈ బస్సులో సుమారు మైనర్లు, మేజర్లు, చంటి పిల్లలతో సహాసుమారు 110 మంది ప్రయాణిస్తున్నారు. ఇది గమనించిన ఎస్సై బస్సును సీజ్ చేశారు. అలాగే బస్సు(సిజి 19 యఫ్ 3366) లో డ్రైవర్లు ఇద్దరు ఉండాల్సి ఉండగా ఒక డ్రైవర్ డ్రైవ్ చేస్తున్నారు. ఇటీవల ట్రావెల్ బస్సులు ప్రమాదాలకు గురి కావటం జరుగుతుందని, అందువల్ల రాష్ట్ర ప్రభుత్వం నిబంధనలు కఠిన తరం చేసిందని తెలిపారు. గురువారం రాత్రి కూడా మారేడు మిల్లి ఘాట్ రోడ్లో ట్రావెల్ బస్సు బోల్తా కొట్టింది.ఈ ప్రమాదంలో 9 మంది మృతి చెందారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా మారేడుమిల్లి ఘాట్ రోడ్ లో శనివారం నుండి రాత్రి పది నుండి ఉదయం 6 గంటల వరకు రాకపోకలు నిషేధించినట్లు చింతూరు సిఐ గోపాలకృష్ణ విలేకరులకు తెలిపారు. సంగీత ట్రావెల్ బస్సుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

దేవరపల్లి కాలనీవీధిలో మంచినీటి కోసం కొత్త మోటర్

విశాలాంధ్ర-జీకే వీధి : గూడెం కొత్తవీధి మండలం దేవరపల్లి పంచాయతీ దేవరపల్లి కాలనీ గ్రామంలో జె జె ఎం మోటారు మరమ్మతులు గురవడంతో జె జె ఎం వర్క్ లో భాగంగా పంచాయతీ నిధుల నుంచి కొత్త మోటర్ వేయించడం జరిగిందని పంచాయతీ సర్పంచ్ సిరిబల బుజ్జిబాబు అన్నారు. ఈ కార్యక్రమంలో టీడిపి మండల ఉపాధ్యక్షులు పాడి శ్రీనివాసరావు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

రైతులను నిలువునా మోసం చేస్తున్న దళారులు

విశాలాంధ్ర-హుకుంపేట : హుకుంపేట వారపు శనివారం సంతలోని దళారీ వ్యాపారులు రైతులు పండించే పంటలకు తీవ్ర మోసం చేసి కోనుగోలు చేస్తున్నారని రైతులు బాధపడుతున్నారు. తూనిక విషయంలో 10కిలోలు బరువు ఉంటే 8, 9 కేజీలు రైతులకు చూపించి కోనుగో లు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మైదాన వ్యాపారులు సంతలో వచ్చి తమకు నచ్చిన ధర పెట్టి ఇష్టరాజ్యంగా ధరతో కోనుగోలు చేస్తున్న సంబంధిత అధికారులు పట్టించు కోవటంలేదని అవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కాఫీ కొను గోలు పై తప్పకుండా లైసెన్స్ పొందా లని ప్రకటించిన అనంతరం ఎఫ్ పి ఓ, ఏఫ్ పి సి,ట్రేడర్స్,మిడిల్ మెన్స్ దరఖాస్తు చేసుకున్న ప్రతి వ్యక్తికి లైసెన్స్ జారీ చేసి ప్రభుత్వ ధరతోనే కోనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ సమావేశం పెట్టి వ్యాపారులతో హుకుం జారీ చేసి ఉన్నారు. అయినా దళారీలు వారపు సంతల్లో, గ్రామా ల్లోకి వెళ్లి బెట్టుకాటలతో తుకాలు చేసి కాఫీ రైతులను మోసం చేస్తున్నారు.ఒకపక్క ప్రభుత్వం,అధికారులు దళారులకు నమ్మి మోసపోవద్దని అవగాహన కల్పిస్తు న్న, మరో పక్క దళారీలు మోసం చేస్తూనే ఉన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి కాఫీ రైతులను మోసం చేస్తున్న దళారీలపై, కాఫీ కొనుగోలు లైసెన్స్ లేని వారిపై కట్టిన చర్యలు తీసుకోవాలని కాఫీ రైతులు, లైసెన్స్ దారులు కోరుతున్నారు.

బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

విశాలాంధ్ర-హుకుంపేట : మండలంలోని కడిగిరి పంచా యతీ కేంద్రం నుండి కే చీడిపుట్టు మీదుగా బర్రెల బ%శీ%ధ గ్రామం వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ 5 కోట్ల 50 లక్షలు నిధులు మంజూరు అయ్యా యి. ఈ నిధులతో నిర్మాణానికి స్థానిక అరుకు ఎమ్మెల్యే రేగం మత్స్యలిం గం ఆదివారం కొబ్బరి కాయ కొట్టి నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం ఆయ న మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో రోడ్డు సౌకర్యం కల్పించడా నికి కృషి చేస్తున్నానని ఆయన అన్నారు.సుమారు గా 41 కిలోమీ టర్లు బీటు రోడ్డు నిర్మాణం ట్రైబల్ వెల్ఫేర్ డిపా ర్టెంట్ నిధులతో చేస్తు న్నమన్నారు. కాంట్రాక్టర్లు నాణ్య త ప్రమాణాలు పాటించి త్వరగా తగతిన నిర్మాణం పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు.ఈ కార్యక్ర మంలో తడిగిరి సర్పంచ్ రంజిత్ కుమార్,హుకుంపేట సర్పంచ్ సమ్మిడ వెంకటపూర్ణిమ,కొంతిలి సర్పంచ్ రేగం రమేష్, మండలం వైస్ ఎంపీపీ ఎస్ కొండలరావు, ట్రైబల్ వెల్ఫేర్ ఇంచార్జి ఏఈ తుడుము బొంజుబాబు, ఇరిగేషన్ డిపార్టెంట్ ఏఈ సతీష్, హుకుంపేట మండల పార్టీ అధ్యక్షు లు పాంగి అనిల్, ఉప అధ్యక్షులు వెంకట్ రావు, వైసిపి నాయకులు మత్యలింగం,భవానిశంకర్, రామ కృష్ణ, నీలకంతం, విశ్వేశ్, తదితరులు పాల్గొన్నారు.

బస్తర్ పిక్కలకు భలే గిరాకీ

కొనుగోలుకు పోటీ పడుతున్న వ్యాపారులు

విశాలాంధ్ర-చింతపల్లి : మన్య ప్రాంతంలో శీతాకాలంలో విరివిగా లభించే బస్తర్ పిక్కలకు భలే గిరాకీ ఏర్పడింది. వాడుక భాషలో శ్రీరామ చిక్కుళ్ళు గా పిలువబడే ఈ పిక్కలు కిలో 200 రూపాయల వరకు ధర పలుకుతూ రైతులను ఆర్థికంగా ఆదుకుంటున్నాయి. ప్రతీ ఏటా నవంబర్, డిసెంబర్, జనవరి మాసాలలో మాత్రమే లభించే ఈ బస్తర్ పిక్కలను కొనుగోలు చేసేందుకు స్థానిక వ్యాపారులతో పాటు మైదాన ప్రాంతాలకు చెందిన అనేక మంది వ్యాపారులు వీటిని కొనుగోలు చేసేందుకు మన్య ప్రాంతానికి తరలి వస్తున్నారు. స్థానిక గిరిజనులు ఈ చిక్కుళ్ళను సేకరించడంతో పాటు వాటి నుండి పిక్కలను వోలిచేందుకు కుటుంబ సభ్యులందరూ రాత్రంతా శ్రమించి ఒలిచి ఉదయాన్నే సమీపంలోని వారపు సంతలకు లేదా మండల కేంద్రాలకు తీసుకుని వెళ్లి విక్రయిస్తుంటారు. ఈ విధంగా సేకరించిన బస్తర్ పిక్కలకు మన్య ప్రాంతంలోనే గాక మైదాన ప్రాంతాలలోనూ మంచి గిరాకీ ఉంది. దీంతో వ్యాపారులు వీటి కొనుగోలుకు పోటీ పడుతున్నారు.

ఈనెల 21న పల్స్ పోలియో కార్యక్రమం

'రెండు చుక్కలు- నిండు జీవితం' నినాదంతో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహణ

విశాలాంధ్ర-అడ్డతీగల : రెండు చుక్కలు-నిండు జీవితం' అనే నినాదంతో రాష్ట్రంలో ఈ నెల 21వ తేదీన జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 5 సంవత్సరాల లోపు సుమారు 54 లక్షల మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 38,267 పోలియో బూత్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.పల్స్ పోలియో డ్రైవ్ తొలి రోజు బూత్ల వద్ద పిల్లలకు టీకాలు వేయనుండగా, అనంతరం రెండు రోజుల పాటు ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి టీకాలు వేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఒక్క చిన్నారి కూడా టీకా నుండి మిస్ కాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.పోలియో వంటి ప్రాణాంతక వ్యాధిని పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ప్రజలు తమ సమీప పోలియో బూత్లకు పిల్లలను తీసుకువచ్చి టీకాలు వేయించి, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో ఎ వి వి కుమార్ కోరారు.

అడ్డతీగలలో 16న మెగా మెడికల్ క్యాంపు

విశాలాంధ్ర-అడ్డతీగల : తెలుగుదేశం పార్టీ అధినేత ఆదేశాల మేరకు ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో, జిఎస్ఎల్ హాస్పిటల్, రాజమండ్రి వారి సౌజన్యంతో ఈ నెల 16-11-2025 మంగళవారం అడ్డతీగల మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించ నున్నట్లు అడ్డతీగల మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జర్త వెంకటరమణారెడ్డి తెలిపారు. ఈ మెగా మెడికల్ క్యాంప్ లో బీపీ, షుగర్, కంటి సంబంధిత వ్యాధులు, ఇతర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న రోగులకు నిపుణ వైద్యులచే ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన సలహాలు అందజేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ, అడ్డతీగల మండలంలోని తెలుగుదేశం పార్టీ మరియు కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు తమ పరిధిలోని ప్రజలకు ఈ విషయాన్ని విస్తృతంగా తెలియజేసి, ఎక్కువ సంఖ్యలో రోగులు హాజరయ్యేలా సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ మెగా మెడికల్ క్యాంప్ను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరిగే ర్యాలీలో అందరూ పాల్గొనాలి

విశాలాంధ్ర-ముంచింగిపుట్టు : అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచింగిపుట్ మండల కేంద్రంలో గల అన్ని పంచాయితీ పరిధిలో గల వైసీపీ ఎంపీటీసి సర్పంచ్ పార్టీ నేతలు అందరూ పాడేరు జిల్లా కేంద్రంలో జరిగే ర్యాలీలో పాల్గొని విజయంతం జేయాలని మండల వైసీపీ పార్టీ అధ్యక్షుడు పద్మారావు (రెడ్డి)అన్నారు. ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేసిన వారికి ప్రత్యేక ధన్యవాదాలు అన్నారు అరకు నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 53 వేల సంతకాలు సేకరించి ఇటీవలే అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి పంపించిన నేపథ్యంలో దానికి అనుగుణంగా ఈనెల 15వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు పాడేరు జిల్లా కేంద్రం నందు భారీ ర్యాలీ నిర్వహించి కరపత్రాలను జిల్లా కేంద్రం నుండి తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంకు తరలించే కార్యక్రమం జరుగుతుందనారు కావున నియోజకవర్గానికి చెందిన ఆరు మండలాల పార్టీ అధ్యక్షులు ఎంపీపీలు జడ్పిటిసిలు వైస్ ఎంపీపీలు సర్పంచులు ఎంపీటీసీలు విద్యార్థి విభాగం నాయకులు వివిధ హెూదాలలో గల నాయకులు, అనుబంధ విభాగాల నాయకులు కార్యకర్తలు ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ర్యాలీలో పాల్గొనాలని జయప్రదం చేయాలని కోరారు.

తల్లిదండ్రుల జ్ఞాపకార్థం రగ్గులు, దుప్పట్లు పంపిణీ

విశాలాంధ్ర-జి.మాడుగుల : తల్లిదండ్రుల జ్ఞాపకార్థం పేదవారికి రగ్గులు, దుప్పట్లు పంపిణీ చేసిన జిమాడుగుల మండల పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి సమిరెడ్డి మాణిక్యం, బంట్రోతు పుట్టు స్వగ్రామంలో మాణిక్యం అమ్మగారైన నూకాలమ్మ, 1989మరియు తండ్రి 1993లో స్వర్గస్తులయ్యారు. చిన్నతనంలోనే తల్లిదండ్రులు కోల్పోయిన, తల్లిదండ్రులు ఇచ్చిన మనోధైర్యం సంకల్పంతో ఆత్మీయ కుటుంబ సహకారంతో ఇంజనీరింగ్ పూర్తి చేసి అమ్మానాన్నల కలలను నెరవేర్చి నేడు మండల పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారిగా విధులను కొనసాగిస్తూ తల్లిదండ్రుల మరియు గ్రామస్తుల అండదండలతో ఈరోజు ఈ స్థాయిలో ఉన్నందుకు సంతోషిస్తూ బంట్రోతు పుట్టు గ్రామంలో సుమారు 60 కుటుంబాలకు అమ్మానాన్నల జ్ఞాపకార్థం రగ్గులు దుప్పట్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ మన గ్రామ బిడ్డగా ఇలాంటి మంచి కార్యక్రమాలు నిర్వహించడం ఇది ఒక కొత్త పరిణామం అని అన్నారు.

పర్యాటక ప్రాంతాలకు తరలివచ్చే పర్యాటకులు తగిన జాగ్రత్తలు పాటించాలి

- వేగ నియంత్రణ, ట్రాఫిక్ సమస్య, ప్లాస్టిక్ నియంత్రణలకు సహకరించాలి
- ఎస్సై వెంకటేశ్వరరావు సూచన

విశాలాంధ్ర-చింతపల్లి : మైదాన ప్రాంతాల నుంచి మన్య ప్రాంతంలోని పర్యాటక ప్రాంతాలకు తరలివచ్చే పర్యాటకులు కనీస జాగ్రత్తలు పాటించాలని స్థానిక ఎస్సై వి వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ శీతాకాలం, తగ్గుతున్న ఉష్ణోగ్రతలు, చలి తీవ్రత, మంచు సోయగాలను ఆస్వాదించేందుకు, అదేవిధంగా మన్య ప్రాంతంలోని జలపాతాలు, పర్యాటక ప్రాంతాలను వీక్షించేందుకు మైదాన ప్రాంతాల నుంచి తరలివచ్చే పర్యాటకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్లు, ద్విచక్ర వాహనాలలో ప్రయాణించే పర్యాటకులు ఈ ప్రాంతాలలోని మలుపులు, రహదారుల పరిస్థితిపై అవగాహన లేకపోవడం వలన ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉందన్నారు. దీనికి తోడు మన్య ప్రాంతంలో దట్టంగా కమ్ముకుంటున్న పొగ మంచు కారణంగా లైట్లు వేసుకుని వెళితే గాని రహదారి కనిపించని పరిస్థితులు ఉన్నందున వాహనదారులు వేగ నియంత్రణ పాటించాలన్నారు. అదే క్రమంలో పర్యాటక ప్రాంతాలను వీక్షించే పర్యాటకులు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులకు సహకరించాలని, అదేవిధంగా ప్లాస్టిక్ నియంత్రణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

గడప దాటితే మనమంతా హిందువులం

- రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రామకృష్ణమూర్తి
- పాకలపాడు ఆశ్రమ రామానంద స్వామి
- మల్లవరంలో ఘనంగా హిందూ సమ్మేళనం

విశాలాంధ్ర-కొయ్యూరు : గడప లోపల కులమని గడప దాటితే అందరం హిందువులమేనని, హిందువులంతా సంఘటితంగా కలిసికట్టుగా జీవించాలని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రామకృష్ణమూర్తి, పాకలపాడు గురుదేవుల ఆశ్రమ రామానంద స్వామీజీ పిలుపునిచ్చారు. మండలంలోని చిట్టింపాడు పంచాయతీ మల్లవరం గ్రామంలో హిందూ సమ్మేళన కార్యక్రమాన్ని చిట్టెంపాడు ఉప మండల పరిధి గ్రామాల ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన విశ్రాంత ఐఏఎస్ అధికారి రామానంద స్వామీజీ మాట్లాడుతూ వందలాది సంవత్సరాలు పరాయి పాలనలో ఉండటం వల్ల హిందువులలో ఐకమత్యత కొరవడిందన్నారు. హిందువులందరును ఐక్యం చేసి సనాతన ధర్మాన్ని పరిరక్షించేందుకు, ప్రతి ఒక్కరిలో దేశభక్తి, దైవభక్తి పెంపొందించేందుకు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ కృషి చేస్తోందని కొనియాడారు. పరాయి మతస్తులు పరాయి దేశస్తులు హిందూమత విచ్ఛిన్నానికి ప్రయత్నాలు చేస్తూ హిందువులను అణగదొక్కే ప్రయత్నాలను చేస్తున్నారని తెలిపారు. లవ్ జిహాదీ పేరుతో భారతదేశ యువతులను విదేశాలకు తీసుకువెళ్లి కట్టు బానిసలుగా మారుస్తున్నారని అటువంటి వాటిని ప్రజలంతా గమనించాలన్నారు. కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు జీవించే మనమంతా ఒక్కటేనని అందరం హిందువులమేనన్నారు. సనాతన ధర్మాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు కోలాటలు అమితంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రజలందరికీ భోజన ఏర్పాట్లను గ్రామస్తులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ జిల్లా ప్రముఖ్ భూమారెడ్డి వివిధ ధార్మిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయి ఐసిడిఎస్ సిడిపిఓ నియమించాలి

జీకే వీధి కో-ఆప్షన్స్ సభ్యులు దావూద్ డిమాండ్

విశాలాంధ్రజీకే వీధి : గూడెం కొత్త వీధి మండలంలో పూర్తిస్థాయి ఐసిడిఎస్ సిడిపిఓ (చైల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్) లేకపోవడంతో క్షేత్రస్థాయి పరిశీలన సక్రమంగా జరగడం లేదని జీకే వీధి కో-ఆప్షన్స్ సభ్యులు దావూద్ ఆవేదన వ్యక్తం చేశారు.ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న సిడిపిఓను జిల్లా ఐసిడిఎస్ పీడీగా నియమించడంతో జీకే వీధి మండలానికి సిడిపిఓ అందుబాటులో లేకుండా పోయారని తెలిపారు. ఈ పరిస్థితుల్లో క్షేత్రస్థాయిలోని సూపర్వైజర్లే అన్ని బాధ్యతలు తామై నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు.దీని వల్ల అంగన్వాడీ కేంద్రాలకు అవసరమైన మార్గదర్శకాలు, పర్యవేక్షణ, క్షేత్రస్థాయి పరిశీలనలు సక్రమంగా జరగకపోవడంతో అంగన్వాడీ కేంద్రాల పనితీరుపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందాల్సిన సేవల్లో లోపాలు ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. కావున అంగన్వాడీ కేంద్రాల సమర్థవంతమైన నిర్వహణ కోసం జీకే వీధి మండలానికి వెంటనే పూర్తిస్థాయి ఐసిడిఎస్ సిడిపిఓను నియమించాలని ప్రభుత్వం, జిల్లా అధికారులను దావూద్ గట్టిగా డిమాండ్ చేశారు.

బైక్ బోల్తా పడి తీవ్రంగా గాయపడిన వ్యక్తి మృతి

విశాలాంధ్ర-కొయ్యూరు : బైక్తో డివైండర్ నీ ఢీ కొట్టిన ఘటనలో గాయపడి హాస్పటల్ లో చేరిన యువకుడు మృతిచెందినట్టు ఎస్ ఐ కిషోర్ వర్మ తెలిపారు. ఈ మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కొయ్యూరు మండలం నకు చెందిన రామరాజుపాలెం కు చెందిన లోత రాజబాబు కంప రేగులు గ్రామానికి చెందిన పనసల సత్తిబాబు పనసల రాజు అనే ముగ్గురు యువకులు ఈ నెల 10వి తేదీన రామరాజుపాలెం నుంచి పెద మాకవారం వైపు వెళుతూ ఈ హై వే రోడ్డు మలుపులో ముగ్గురు యువకులు బైక్ పై వెళుతూ బైక్ తో డివైండర్ ను డీ కొట్టారు. దీంతో తీవ్రంగా గాయపడిన ముగ్గురికి గాయాలు కాగా వీరిలో పనసల రాజు కు బలమైన దెబ్బలు తగలటంతో నర్సీపట్నం ఏరియా హాస్పటల్ లో చేర్చి వైద్యం పొందుతున్న రాజు కుటుంబ సభ్యులు స్వగ్రామానికి తీసుకురావడంతో శనివారం రాత్రి మృతి చెందినట్టు ఎస్ఐ తెలిపారు. మృతి చెందిన వ్యక్తిని పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం తరలించి పోస్టుమార్టం నిర్వహించారుఈ ప్రమాదంపై ఇప్పటికే కేసు నమోదు చేయగా ముగ్గురిలో ఒకరు మృతితో అతనికి పోస్టు మార్టం చేసి బంధువులకు అప్పగించనున్నట్టు ఎస్ ఐ కిషోర్ వర్మ తెలిపారు.

ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నేడు బహిరంగ ర్యాలీ

వైఎస్ఆర్ సిపి ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి

విశాలాంధ్ర-జి.మాడుగుల : గవర్నమెంట్ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పాడేరు జిల్లా కేంద్రంలో ఈ నెల 15న నిర్వహించనున్న భారీ ర్యాలీని విజయవంతం చేయాలనీ వైయస్ఆర్ సిపి ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు, పాడేరు మాజీ ఎమ్మెల్యే, కొట్టగుల్లి భాగ్యలక్ష్మి పిలుపునిచ్చారు. కోటి సంతకాల సేకరణ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాలలో విజయవంతంగా పూర్తైన నేపథ్యంలో ఈ ర్యాలీ జరగనుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున వైసీపీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని మండల వైస్ ఎంపీపీలు, వైఎస్ఆర్సీపీ నాయకులు, ఎంపీటీసీలు, సర్పంచులు, వార్డు సభ్యులు, పార్టీ రాష్ట్ర-జిల్లా-నియోజకవర్గ వర్గాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులను కోరారు. ఈ నందర్భేగా భాగ్యలక్ష్మి మాట్లాడుతూ వైద్య ఆరోగ్య రంగాన్ని కూటమి ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందనీ పేర్కొన్నారు, ఏజెన్సీలో గిరిజనులకు వైద్యం అందరికి అందనీ ద్రాక్షగానే మిగిలిపోతుందని అలాంటి తరుణంలో ఏజెన్సీ ప్రాంతా లకు కూడా వైద్యంతో పాటు గిరిజన మరియు పేద బిడ్డలందరికీ ఉచిత వైద్య విద్యను మరియు వైద్యాన్ని కూడా అందించాలనే విశాల దృక్పథంతో వైసిపి అధినేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి, విశాల దృక్పథంతో మెడికల్ కళాశాలను ఏర్పాటు చేశారన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు లేకపోవడం, అత్యవసర పరిస్థితుల్లో 104, 108 అంబులెన్సులు అందుబాటులో లేక పోవడం, కూటమి పాలనలో ప్రజా ఆరోగ్య వ్యవస్థ క్రమంగా కుప్ప కూలిపోతున్న సంకేతాలని అన్నారు. ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించకపోవడం వల్ల ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన విపరీతమైన ప్రజా మద్దతు, ప్రజలు వైఎస్ఆర్సీపీ పోరాటానికి ఇచ్చిన అండదండల స్పష్టమైన నిదర్శనమని, భాగ్యలక్ష్మీ అన్నారు.175 నియోజకవర్గాల్లో కోటి మందికి పైగా ప్రజలు స్వఛ్ఛందంగా సంతకాలు చేసి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారని తెలిపారు. సేకరించిన సంతకాల ప్రతులను డిజిటలైజ్ చేసి ఈ నెల 18న వైఎస్ఆర్సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గవర్నర్ కు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ భారీ బహిరంగ ర్యాలీ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ పార్టీలకతీతంగా వచ్చి ఈ బహిరంగ ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు.

పిజిఆర్ఎస్ అర్జీల వివరాలు మీకోసం వెబ్ సైట్‌లో నమోదు చేయవచ్చు

జిల్లా కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర రెడ్డి

విశాలాంధ్ర-పార్వతీపురం : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్)లో అర్జీల వివరాలు మీకోసం వెబ్ సైట్ లో నమోదు చేయవచ్చని జిల్లా కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర రెడ్డి తెలిపారు. సమర్పించిన అర్జీల స్థాయిని 1100 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని జిల్లా కలెక్టర్ చెప్పారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అన్ని కార్యాలయాల్లో ప్రజల సమస్యలు సోమవారం స్వీకరించడం జరుగుతుందని ఆయన తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రతి రోజూ ప్రజల నుంచి వినతులు స్వీకరించుటకు సెల్లార్‌లో ప్రత్యేకంగా సెల్‌ను ఏర్పాటు చేశామని ఆయన చెప్పారు. అర్జీదారులు Meekosam.ap.gov.in వెబ్సైట్‌లో అర్జీలు నమోదు చేసుకోవచ్చున్నారు. అర్జీల నమోదు, నమోదైన అర్జీల స్థితి, దానికి సంబంధించి సమాచారం తెలుసుకొనుటకు 1100కి నేరుగా కాల్ చేయవచ్చని తెలిపారు.

ధాన్యం కొనుగోలులో రైతులను అనేక ఇబ్బందులకు గురిచేస్తున్న మిల్లర్లు

విశాలాంధ్ర-బెలగాం : ఈ ఖరీఫ్ సీజన్లో ధాన్యం కొనుగోలులో రైతులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం వెళ్లినప్పటికీ ధాన్యం నాణ్యత లోపం అని మిల్లర్లు అనేక మంది రైతులను మిల్లులోకి తెప్పించుకొని భార్గయినింగ్ చేయడం జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పార్వతీపురం మన్యం జిల్లా ప్రధాన కార్యదర్శి బంటు దాసు ఆరోపించారు. ఈమేరకు ఆయన మాట్లాడుతూ మిల్లర్లు 5 నుంచి 12 కేజీల వరకు రైతుల వద్ద అదనంగా అడుగుతుండడం వాస్తవమని ఈ విషయాన్ని రైతుల ద్వారా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘంగా మేము అనేకసార్లు సివిల్ సప్లై డిఎంకు చెప్పినప్పటికీ మిల్లర్లు మా మాట వినలేనందువలన మీరు రైతులతో రైతు సంఘంగా మీరు కూడా మాట్లాడండని చెప్పినందువలన కొంతమంది మిల్లర్లు రైతుల వద్ద 100 కేజీల నుంచి 105 కేజీల వరకు తీసుకున్నప్పటికీ మరి కొంతమంది మిల్లర్లు మీరు ఎవరితో చెప్పుకున్నా మాకు ఏమీ అభ్యంతరం లేదు మీ ధాన్యం డస్ట్ ఎక్కువుంది కాబట్టి మాకు 12 కేజీల వరకు అధనంగా ఇస్తే గాని దించమని చెబుతున్నారన్నారు. ఈ విషయాన్ని సివిల్ సప్లై డిఎంకు, జెసి దృష్టికి వెళ్లినప్పటికీ, నాగూరు వద్ద ఒక మిల్లు వద్దకు వెళ్లి తొడబండి విజయలక్ష్మి అనే రైతును రమ్మని స్వయంగా జెసి, డిఎం ఇన్స్పెక్షన్ చేసి డిఎం 9 కేజీల వరకు అదనంగా ఇవ్వాలని రైతుకు చెప్పినందువలన, ఆ రైతు తన 200 బ్యాగులకు అదనంగా చెల్లించారని అప్పుడు గాని ఆ మిల్లరు ఆ వెహికల్ నుంచి ధాన్యాన్ని దించలేదని, అప్పటికే ట్రక్ సీట్ జనరేటై ఆ మిల్లుకు వెళ్లి మూడు రోజులైందని ఇది ఉదాహరణకు మాత్రమేనన్నారు. పార్వతీపురం డివిజన్లో గల అనేక మిల్లుల్లో ఈ సమస్య తలెత్తడం జరిగిందని మేము చెప్పడమే కాకుండా మీ రికార్డుల్లో ఉన్న ట్రక్ సీట్ లను తనిఖీ చేసిన ప్రతి మిల్లు దగ్గర ట్రక్ సీట్ జనరేట్ అయి 24 గంటల్లో దించవలసి ఉన్నప్పటికీ మూడు నుంచి నాలుగు రోజుల వరకు పట్టేదని దీనికి కారణం రైతుల నుండి భార్గయినింగ్ చేయడమేనని ఈ విషయం కలెక్టర్ కు మినహా మిగతా అధికారులందరికీ జిల్లాలో గల ఎమ్మెల్యేలకు కూడా తెలిసినప్పటికీ, ఏ అధికార ప్రతిపక్ష నాయకులు కూడా దీనిపై ఇప్పటికీ కూడా ఎటువంటి ప్రకటన చేయడం లేదన్నారు. ఈ పరిణామాల వలన రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షులు రైతుల వద్ద నుండి నాణ్యమైన ధాన్యాన్ని తీసుకురావాలని ఒత్తిడి చేయడం జరుగుతుందని ఈ నాణ్యతను కూడా ధాన్యం మొక్కైన విషయాన్ని రైతు భరోసా కేంద్రం వద్ద నిర్ధారణ చేయకుండా మిల్లర్లే తన వద్ద మిషన్లను పెట్టుకుని నిర్ధారించినందునే వ్యవసాయ శాఖ వారు అంగీకరించి ధాన్యం అదనంగా ఇవ్వాలని చెప్పడం జరుగుతుందన్నారు. దీన్ని ఆసరాగా చేసుకొని గ్రామాలలో గల వ్యాపారస్తులు మరి కొద్దిగా ఎక్కువ ధాన్యాన్ని రైతుల నుండి అడుగుతున్నారని మిల్లుల వద్ద ధాన్యం దించడం ఆలస్యమైనందువలన రైతే వాహనాన్ని పెట్టి పంపించినందువలన రెండు మూడు రోజులు ఆ వాహనం నుండి ధాన్యం దించనందువలన ఈ అద్దెనంతటిని రైతు భరించాలని భయపడి, ఈ బాధలు భరించలేక ప్రైవేటు వ్యాపారస్తులకు ధాన్యాన్ని ఇవ్వడం జరుగుతుందన్నారు. మిల్లర్ల వద్దకు ఈ వారం పది రోజులలో ధాన్యాన్ని రైతులు తీసుకువస్తున్నారు కాబట్టి ప్రభుత్వం వారికి మేము ఇవ్వవలసిన 100 కేజీల ధాన్యానికి 67 కేజీల బియ్యం రావడం లేదని ఈ సంపత్ ధాన్యంలో 30 బస్తాల వరకు నూకలు 30 బస్తాల వరకు బియ్యం వస్తున్నాయని చెప్పడం జరుగుతుందని ఈ విషయాన్ని కూడా రైతు సంఘంగా పరిశీలించినప్పుడు కొంతవరకు వాస్తవమని తెలుసుకున్నప్పటికీ, ఈ నష్టాన్ని అటు మిల్లర్లు గానీ ఇటు రైతుగాని భరించడం చాలా కష్టం కాబట్టి ఇటువంటి విషయాన్ని ప్రభుత్వం, ప్రభుత్వాధికారులు స్థానిక ఎమ్మెల్యేలు, జిల్లా మంత్రివర్యులు అలాగే వ్యవసాయ శాఖ మంత్రివర్యులు చొరవ తీసుకొని ప్రభుత్వమే ఈ నష్టాన్ని భరించి అటు మిల్లులను ఇటు రైతులను ఆదుకోవాలని మా సంఘంగా కోరుతున్నామని ఎందుకంటే ఈ విత్తనాన్ని రైతుకు పంపిణీ చేసినది రాష్ట్ర ప్రభుత్వమే కాబట్టి ఈ ధాన్యాన్ని అమ్ముకునేటప్పుడు నష్టం జరిగితే ప్రభుత్వమే భరించాలి కాబట్టి ఈ నష్టం విషయమై ప్రభుత్వం చర్యలు తీసుకొని రైతాంగానికి మిల్లర్లకు నష్టం లేకుండా చేసి సమస్యను పరిష్కారం చేయకపోతే రైతులలో తీవ్రమైన ఆందోళన వ్యక్తమౌతుందన్నారు. మరి కొద్దిరోజుల్లో పాలకొండ డివిజన్లో గల రైతులందరూ ధాన్యం నూర్పుదులు ముమ్మడిగా చేస్తారని ఆ ప్రాంతంలో కూడా గత మూడు నాలుగు రోజుల క్రితం ఒక మిల్లు వద్దకు అదనపు ధాన్యం తీసుకున్నారని, బాసురు గ్రామపు రైతులు మిల్లు వద్దకు, ఎమ్మార్వో కార్యాలయాలు వద్దకు వెళ్లి ధర్నా చేయవలసిన పరిస్థితి ఏర్పడింది కాబట్టి ఈ విషయాలన్నిటినీ పరిగణనలో ఉంచుకొని ప్రభుత్వాధికారులు, ప్రజా ప్రతినిధులు కలిసి ఈ సమస్యలన్నిటికీ పరిష్కారం చేయాలని రైతు సంఘంగా కోరుతున్నామన్నారు. తక్షణమే ప్రభుత్వ యంత్రాంగం చొరవ తీసుకొని ఈ సమస్యకు పరిష్కారం తీసుకోపోతే చాలా తీవ్రమైన పరిణామాలు ఏర్పడతాయని ఎందుకంటే రైతులు ఆగ్రహానికి గురవుతున్నారని, సంపత్ ధాన్యం ఎక్కువ ప్రాంతాల్లో వేయడం జరిగిందని కాబట్టి రైతు సంఘంగా అధికార యంత్రాంగాన్ని రాజకీయ నాయకుల్ని ప్రజాప్రతినిధులను కోరుతున్నామని ఈ విషయాలను కలెక్టర్ కు, జెసికి, సివిల్ సప్లై డిఎంకు పత్రికా ముఖంగా కోరుతున్నామని తెలిపారు.

గ్రంథాలయంలో విద్యార్థులకు ఆటల పోటీలు

గ్రంథాలయ నిర్వాహకులు నల్ల మధుసూదనరావు

విశాలాంధ్ర-గరుగుబిల్లి : మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆదేశాల మేరకు ఆదివారం చదవడం మాకిష్టం కార్య క్రమంను నిర్వహించారు. చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు చదువుపై ఆసక్తి కలిగించడంతో పాటు ఆటల పోటీలను నిర్వహించారు. ఈసందర్భంగా శాఖా గ్రంథాలయం నిర్వాహకులు నల్ల మధుసూదన రావు మాట్లాడు తూ గ్రంథాలయాల్లో విద్యార్థులకు ఉపయోగపడే పలురకాల పుస్తకాలు ఉన్నాయని వీటిని చదువుకోవాలని కోరారు. పోటీ పరీక్షలకు ఉపయోగ పడే పుస్త కాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. గ్రంథాలయములో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆదేశాలు మేరకు నిర్వహిస్తున్న చదవడం మాకిష్టం కార్యక్రమమును విజయవంతంగా నిర్వహించడంతోపాటు విద్యార్థులకు ఆటల పోటీలతోపాటు చదువుపై ఆసక్తి కలిగించేలా పలు కార్యక్రమాలు నిర్వహిం చడం జరిగిందన్నారు. ప్రస్తుతం నిర్వహించిన చదవడం మాకిష్టం కార్యక్రమంలో విద్యార్థులు అధికసంఖ్యలో పాల్గొన్నారని గ్రంథాలయం నిర్వాహకులు మధుసూదనరావు తెలిపారు. ఈకార్యక్రమంలో అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లాలో ప్రభుత్వ విద్యా సంస్థలను ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర-బెలగాం : పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రభుత్వ విద్యా సంస్థలను ఏర్పాటు చేయాలని సామాజిక చైతన్య వేదిక ఉత్తరాంధ్ర కన్వీనర్ వి. రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా రంజిత్ కుమార్ మాట్లాడుతూ పార్వతీపురంలో మహిళా డిగ్రీ, జూనియర్ కళాశాలలను ఏర్పాటు చేయాలని, అలాగే ప్రభుత్వ ఐటీఐ, పీజీ కళాశాల ఏర్పాటు చేయాలని, గరుగుబిల్లిలో జూనియర్ కళాశాల, కురుపాంలో డిగ్రీ కళాశాల, గుమ్మలక్ష్మీపురంలో "డైట్" కళాశాల ఏర్పాటు చేయాలని, అలాగే పార్వతీపురంలో గిరిజన విద్యార్థుల కోసం అదనంగా కళాశాల వసతి గృహాలు ఏర్పాటు చేయాలని, సాంఘిక సంక్షేమ, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ కళాశాల వసతి గృహాలకు సొంత భవనాలు నిర్మాణం చేయాలని, కురుపాం లోని ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీ నిర్మాణం పనులు పూర్తి చేయాలని, వచ్చే విద్యా సంవత్సరం నుంచి అడ్మిషన్లు జరిపి కురుపాంలో తరగతులు నిర్వహించాలని, పాచిపెంటలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలకు నూతన భవనం నిర్మాణం చేయాలని, కురుపాంలో గిరిజన బాలికల కళాశాల వసతి గృహంకు సొంత భవనాలు నిర్మాణం చేయాలని రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. సాలూరు ప్రభుత్వ ఐటిఐకి సొంత భవన నిర్మాణం చేయాలని, పాచిపెంట మండలం లోని కొటికి పెంట "ఏకలవ్య"పాఠశాల భవనం నిర్మాణం పనులు పూర్తి చేయాలని, సంక్షేమ విద్యార్థులకు "మెస్"చార్జీలు పెంచి పౌష్టికాహారం అందించాలని, కొమరాడ గిరిజన బాలుర గురుకుల పాఠశాలను జూనియర్ కళాశాలగా "అప్ గ్రేడ్" చేయాలని డిమాండ్ చేశారు. పాచిపెంట, మక్కువ, కొమరాడ, బలిజిపేట మండల కేంద్రాల్లో కళాశాల వసతి గృహాలు ఏర్పాటు చేయాలని కోరారు.

ఇష్టానుసారంగా మట్టి తవ్వకాలు...

పట్టించుకోని రెవెన్యూ యంత్రాంగం

విశాలాంధ్ర-కొమరాడ : కొమరాడ మండలంలో ఇష్టానుసారంగా అక్రమ మట్టి గ్రావెల్ తవకాలు రోజురోజుకి పెరిగిపోతున్న సంబంధిత రెవెన్యూ అధికారులు మైనింగ్ అధికారులు పట్టించుకోకపోవడంతో మట్టి గ్రావెల్ అక్రమార్కులు నీ గుర్తు చప్పుడు కాకుండా తవ్వికి పోతున్నారు. కొమరాడ మండలంలోని కొమరాడ మండల కేంద్రం అంటివలస గ్రామ సమీపంలో ఆదివారం మట్టి తవ్వకాలు జోరందుకోవడంతో స్థానిక కూటమి నాయకులు మట్టి అక్రమ తవ్వకాలు పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఇష్టానుసారంగా వివిధ అవసరాల కోసం మట్టి తవ్వకాలు ఎటువంటి అనుమతులు లేకుండా విచ్చలవిడిగా జెసిబి తో రాత్రి పగలు తేడా లేకుండా గుట్టు చప్పట్లు కాకుండా తవ్వకాలు జరుపుతున్నారు. గత బుధవారం మట్టి తవ్వకాలు జరిపిన సమయంలో స్థానికులు ఫిర్యాదు చేయడంతో నిలుపుదల చేసి మరల ఆదివారం సెలవు దినం కావడం అధికారులు ఎవరూ అందుబాటులో ఉండరు అనే ఉద్దేశంతో మట్టి తవ్వ కాలు జరుగుతున్నాయి. రెవిన్యూ అధికారులకు మైనింగ్ అధికారులకు స్థానికులు మట్టి తవ్వకాలపై ఫిర్యాదు చేసిన కనీసం ఎవరు పట్టించుకోకపోవడం చర్యలు తీసుకోకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మారుమూల ప్రదేశాల్లో మట్టి తవ్వకాలు జరిగిన పట్టించుకోకపోవడం ఒక విషయమైతే అంతర్రాష్ట్ర రహదారిపై నుంచి మట్టి తరలిస్తున్న కనీసం అధికారులు పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు దారితీస్తుంది. రెవిన్యూ అధికారులకు బుధవారం నాడు మట్టితవ్వ కాలపై ఫిర్యాదులు చేస్తే రెవిన్యూ అధికారులు మా రెవిన్యూ కార్యాలయానికి అవసరం నిమిత్తం ఒక నాలుగు లోడ్లు వేసి మీకు నచ్చినట్లు తవ్వుకోండి అన్న విధంగా రెవెన్యూ అధికారులు తీరు ఉందని ఈ స్థానిక ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం మట్టి తవ్వకాలపై రెవెన్యూ తాహసిల్దార్, ఆర్ఐ వీఆర్వోలుకు మైనింగ్ అధికారులకు స్థానికులు ఫోన్లో తెలియచేసిన కనీసం ఏ ఒక్కరు పట్టించుకోకపోవడంతో అధికారులకు మట్టితో భారీగా ముడుపులు అందాయని ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ మైనింగ్ అధికారులు స్పందించి అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు జరిపితే వారిపై చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు నాయకులు కోరుతున్నారు. ఈ విషయంపై తాసిల్దార్ సిహెచ్ సత్యనారాయణ వివరణ కోరగా సంబంధిత రెవెన్యూ అధికారులను పంపించి చర్యలు తీసుకుంటామని చెప్పడం విడ్డూరం

పదవ తరగతి విద్యార్థి ఆత్మహత్యాయత్నం

విశాలాంధ్ర-సాలూరు : మండలంలోని కురుకూటి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థిని ఆత్మ హత్యకు పాల్పడిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న హెచ్ఎం సకాలంలో స్పందించి, హుటాహుటిన స్పందించటంతో అమ్మాయి ప్రాణాపాయం నుండి బయట పడింది. దీనితో అంతా ఊపిరి పీల్చుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని వెలగవలసకు చెందిన వలస రాము అనే అమ్మాయి కురుకూటి బాలికల ఆశ్రమ పాఠశాలలో పదవ తరగతి చదువుతోంది. ఆదివారం ఉదయం తోటి విద్యార్థులతో స్వల్ప వాదన జరిగింది. ఒక పరీక్ష చూసి రాసావంటూ తోటి విద్యార్థులు ఎగతాళిగా మాట్లాడటం, మాటా, మాటా పెరగటంతో, మనస్థాపానికి గురైన రాము బాత్ రూం లను శుభ్రం చేసేందుకు నిల్వ ఉంచిన పినాయిల్ త్రాగి ఆత్మ హత్యకు పాల్పడింది. విషయం తెలుసుకున్న హెచ్ఎం మంజు విద్యార్థినిని హుటాహుటిన తోణాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకు వెళ్లారు. ఆసుపత్రి సిబ్బంది వైద్యాధికారి అజయ్ కి ఫోన్ చేసి చెప్పగా, ఆయన వెంటనే వచ్చి ప్రాథమిక చికిత్స అందించి, విద్యార్థి తీసుకున్న ద్రావణాన్ని కక్కించటం జరిగింది. అయినప్పటికీ పొట్టను పూర్తిగా శుభ్రపర్చాల్సి ఉన్నందున అమ్మాయిని సాలూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే అమ్మాయి ఆరోగ్యం మెరుగ్గానే ఉందని, ప్రాణాపాయం లేదని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. దీనితో విద్యార్థి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఊపిరి పీల్చుకున్నారు.

నేవీ మారథాన్‌లో సత్తాచాటిన కురుపాం ఆశ్రమ విద్యార్థి

విశాలాంధ్ర-కురుపాం : విశాఖపట్నంలో ఇండియన్ నేవీ ఆధ్వర్యంలో నిర్వహించిన 10 కిలోమీటర్లు మారథాన్ లో కురుపాం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఐదో తరగతి చదువు తున్నా నిమ్మక చంద్ర మౌళి(10) సత్తా చాటాడు. ఆదివారం ఉదయం నిర్వహించిన మారథాన్‌లో 10కిలోమీటర్లను 59 నిమిషాలలో పరిగెత్తిన అతి చిన్న వయస్కుడు. అలాగే గుమ్మలక్ష్మీపురం మండలం చినగీసాడా ప్రమాంచాయితీ, నోంద్రుకోన గ్రామానికి చెందిన నిమ్మక సోమేశ్వరరావు, మండంగి సింహాచలం 5కిలోమీటర్ల రన్‌లో పాల్గొన్నారు. 10కిలోమీటర్ల విభాగంలో సోమేశ్వర రావు 40.32నిమిషాలకు అలాగే 10 సంవత్సరం అయినటువంటి చంద్రమౌళి 59.26 నిమిషాలలో పూర్తి చేశారు. నెల్లికిక్కువ పంచాయితీ జోగిపురం గ్రామానికి చెందిన జీలకర్ర జయరాం కూడా 10 కిలోమీటర్లు 50.25 నిమిషాలలో పూర్తి చేసారు. వీరికి నేవీ అధికారులు మెడల్స్ ప్రదానం చేశారు.

ప్రజా ఉద్యమానికి తరలిరండి...

వైసిపి జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజ్



విశాలాంధ్ర-కురుపాం : పేద మధ్యతరగతి కుటుంబాలకు వైద్య విద్య, వైద్య కళాశాలలనుదూరం చేస్తూ కార్పొరేట్ సంస్థలకు కూటమి పార్టీ నాయకులకు కట్టబెట్టేందుకు ప్రభుత్వం పూనుకుందని దీన్ని వ్యతిరేకంచి తిరిగి సాధించేందుకుగాను రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి ఆదేశాల మేరకు చేపట్టిన కోటి సంతకాల కార్యక్రమాన్ని నియోజకవర్గం స్థాయిలో జయప్రదం చేసామని అదే తరహాలో సోమవారం జిల్లా స్థాయిలో ప్రజా ఉద్యమాన్ని చేపట్టేందుకు పార్వతీపురం మన్యం జిల్లా పార్టీ అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షితరాజు పిలుపునిచ్చారు. ఈమేరకు కురుపాం, పార్వతీపురం, పాలకొండ, సాలూరు, నియోజకవర్గంలోని వైఎస్ఆర్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్దఎత్తున తరలి రావాలన్నారు. ఈ కార్యక్రమం 15-12-2025 మధ్యాహ్నం 2.30 గంటలకు పార్వతీపురం ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం నుండి ర్యాలీ కార్యక్రమం ఉంటుందని ఆయన తెలిపారు.

ఆక్రమణకు గురవుతున్న ప్రధాన కాలువలు

చోద్యం చూస్తున్న అధికారులు

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: పట్టణ ప్రధాన రహదారిలోని ప్రధాన మురుగు కాలువలు ఆక్రమణకు గురికావటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని మెయిన్ రోడ్డులో మురుగు కాలువలు మాయమవుతున్నాయని కాంగ్రెస్ పార్టీ ఓ.బి.సి.జిల్లా అధ్యక్షులు వంగల దాలి నాయుడు, మండల అధ్యక్షులు తీళ్ల గౌరీ శంకరరావు, నియోజకవర్గం చైర్మన్ సిరిసిపల్లి సాయి శ్రీనివాస్, ఎస్సీ సెల్ చైర్మన్ కోలా కిరణ్ కుమార్,కిసాన్ సెల్పార్వతీపురం మండలం అధ్యక్షులు బంకపల్లి ఉమామహేశ్వర రావు,కిసాన్ సెల్ నియోజకవర్గం అధ్యక్షులు చొక్కాపు వెంకటరమనణ తదితరులు విలేకరులతో మాట్లాడుతూ పార్వతీపురం పట్టణ మెయిన్ రోడ్డులో రాయగడ రోడ్డు నుండి బెలగాం వరకు ఇరువైపులా మురుగు కాలువలు కబ్జాకు గురవుతున్నాయన్నారు. పలుచోట్ల మురుగు కాలువలు కనిపించే పరిస్థితి లేదన్నారు. పట్టణంలోని బడా వ్యాపారుల షాపుల వద్ద మురుగు కాలువలను కలిపి ఆయా షాపులకు రహదారులు నిర్మించుకున్నారన్నారు. ముఖ్యంగా పార్వతీపురంలో ఇటీవల ప్రారంభమైన సీఎంఆర్ షాపింగ్ మొదలుకొని పలు బంగారపు షాపులు, బట్టల షాపులు వద్ద మురుగు కాలువలు మచ్చికైనా కనిపించటం లేదన్నారు. అలాగే పట్టణ నడిబొడ్డును ప్రవహిస్తున్న వరహాల గెడ్డపై కూడా ఎస్.ఆర్.తో పాటు కొంతమంది వ్యాపారులు తమ షాపులకు మార్గాన్ని ఏర్పాటు చేసుకునే క్రమంలో అడుగడుగుకీ ఒక వంతెన నిర్మించి వరహాల గెడ్డకు నామరూపాలు లేకుండా మార్చేశారన్నారు. అలాగే మోర్ లాంటి కొన్ని పెద్ద షాపులకు సెల్లార్ లేక పోవడం వలన వాహనాల పార్కింగ్ మెయిన్ రోడ్డు పై చేస్తుండడంతో పట్టణాన్ని నిత్యం ట్రాఫిక్ సమస్య వేధిస్తోందన్నారు. ఇది పోలీసులకు తలనొప్పిగా తయారైయ్యిందన్నారు. మెయిన్ రోడ్డును ఆక్రమించి కొంతమంది వ్యాపారాలు చేస్తుండడంతో నిత్యం ఆయా జంక్షన్‌లలో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. పార్వతీపురం పట్టణ మెయిన్ రోడ్డులో మురుగు కాలువలు మెయిన్ రోడ్డు ఆక్రమణలకు గురికావడంతో మురుగు కాలువల్లో మురుగు తొలగించే పరిస్థితి కానరావడం లేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత మున్సిపల్ రెవెన్యూ ఆర్ అండ్ బి అధికారులు ఈ విషయంపై దృష్టి సారించి ఆక్రమణలు తొలగించాలని డిమాండ్ చేశారు.

ద్విచక్రవాహనంపై జారిపడి మహిళకు తీవ్ర గాయాలు

విశాలాంధ్ర-సీతానగరం : మండలంలోని అంటిపేటనుండి సీతానగరంవైపు ద్విచక్ర వాహనంపై వస్తున్న రెడ్డివానివలస గ్రామానికి చెందిన రెడ్డి విజయ అనే మహిళ ద్విచక్రవాహనంపై జారిపడి రోడ్డుపై పడగా తలకు బలమైన గాయాలు తగిలాయి. వెంటనే స్థానికులు ఆటోలో బొబ్బిలి ఆసుపత్రికి తరలించారు. ఆమె తలకు బలమైనగాయం తగలడంతో విజయనగరం ఆసుపత్రికి రిఫర్ చేసినట్లు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు.

పిడిఎఫ్ బియ్యం పట్టుకున్న పోలీసులు

విశాలాంధ్ర-పాచిపెంట : మండలంలో గల పి.కోనవలస చెక్‌పోస్ట్ వద్ద సాధారణ వాహనాలు తనిఖీలో భాగంగా సాయంత్రం 6 గంటల సమయంలో పార్వతీపురం మండలం తాళ్ల బురిడి రైస్ మిల్లు వద్ద నుండి ఏపీ 35 ఎక్స్ 54 99 లారీలో సుమారు 500 బస్తాలు ఒడిస్సా రాష్ట్రం తరలిస్తుండగా పట్టుకున్నట్లు పాచిపెంట ఎస్సై వెంకట్ సురేష్ తెలిపారు. పిడిఎఫ్ బియ్యం సుమారు 25 టన్నులు ఉన్నట్లు తెలిపారు వీటి విలువ సుమారు 9,50,000 ఉంటుందని అన్నారు డ్రైవర్ను అరెస్ట్ చేసినట్లు తెలిపారు డ్రైవర్తోపాటు రైస్ మిల్ ఓనర్ పై కూడా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు దినము అనగా తేదీ 13 12 2025 న సాయంత్రం సుమారు 6:30 గంటల సమయంలో పి కోనవలస చెక్పోస్ట్ సమీపంలో పార్వతిపురం మండలం తాళ్లబురిడి రైస్ మిల్లు వద్ద నుండి AP 35X 5499 నంబరు గల లారీలో సుమారు 500 బస్తాల పిడిఎస్ రైస్ ను లోడ్ చేసుకుని ఒరిస్సా జైపూర్ కు తీసుకు వెళ్తుండగా చెక్ పోస్ట్ వద్ద పట్టుకోవడం ఈ విధంగా పిడిఎఫ్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండడం నేరమైనప్పటికీ చాలామంది తరలిస్తున్నారని అన్నారు పట్టుకున్న రైస్ ను సి ఎస్‌డిటికి అప్పగించినట్లు తెలిపారు. పిడిఎస్ రైసు మొత్తం 25 టన్నులు ఉండి దాని విలువ సుమారు 9,50,000గా ఉందిని అన్నారు పట్టుకున్న బియ్యాన్ని పాచిపెంట సిఎస్‌డిటికి అప్పగించడం జరిగిందని తెలిపారు.

నేటి కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమ ర్యాలీని విజయవంతం చేయాలి : మాజీ ఎమ్మెల్యే జోగారావు

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్ : జిల్లా కేంద్రంలో నేడు తలపెట్టిన కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమ ర్యాలీని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు కోరారు. ఆదివారం ఆయన బలిజిపేట మండల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వైయస్సార్ సీపీ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమం కార్యక్రమంలో భాగంగా సోమవారం మధ్యాహ్నం రెండున్నర గంటలకు పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో గల దివంగత మహానేత డాక్టర్ వై.యస్.రాజశేఖర్ రెడ్డి విగ్రహం కూడలి వద్ద ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జిల్లాలో పరిధిలో గల నాలుగు నియోజకవర్గాల ప్రజలు నుంచి సేకరించిన లక్షలాది సంతకాల ప్రతులు నేడు వాటిని ప్రత్యేక వాహనం ద్వారా ప్రజా ఉద్యమ ర్యాలీగా రాష్ట్ర పార్టీ కేంద్ర కార్యాలయానికి పంపించే బృహత్తర ప్రజా ఉద్యమం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని కావున పై ప్రజా ఉద్యమ ర్యాలీలో బలిజిపేట మండలంతో పాటుగా నియోజకవర్గం పరిధిలో గల సీతానగరం, పార్వతీపురం అర్బన్ మరియు రూరల్ మండలాల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో ఉన్న పార్టీ అనుబంధ విభాగాల కమిటీ అధ్యక్షులు, మండల పార్టీ కమిటీ సభ్యులు మరియు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పార్టీ శ్రేణులు, ప్రజలు, యువత, విద్యార్థులు అంతా కలిసి పెద్ద ఎత్తున పాల్గొనాలని జిల్లా స్థాయి కార్యక్రమం విజయవంతం చేయాలనీ కోరుతూ ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆయనతో పాటు మండల పార్టీ అధ్యక్షులు పాలవలస మురళీకృష్ణ, పట్టణ పార్టీ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, జడ్పీటీసీ అలజంగి రవికుమార్, వైస్ ఎంపీపీ వెలిది సాయిరాం, వివిధ గ్రామాల సర్పంచ్లు కురిటి మోహన్ రావు, కురీటి వెంకటరమణ, జిల్లా ఇంటిలెక్టివల్ విభాగం అధ్యక్షుడు పోరాన శ్రీరామచంద్ర నాయుడు, మండల యూత్ అధ్యక్షులు రనదేవ లక్ష్మణరావు, మాజీ ఏఎంసి డైరెక్టర్ బురిడి సూర్యనారాయణ, వివిధ గ్రామాల మాజీ సర్పంచ్లు, ఎంపీటీసీ సభ్యులు, సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

16న మండల సమావేశం

విశాలాంధ్ర-సీతంపేట : మండల ప్రజా పరిషత్ ఆధ్వర్యంలో వై టి సి సమావేశ మందిరంలో సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పిటిసి,మండల అధికారులతో, మండల అభివృద్ధిపై ఎంపీపీ బిడ్డిక. ఆదినారాయణ అధ్యక్షతన సమావేశం నిర్వహించడం జరుగుతుందని సమావేశానికి సభ్యులంతా తప్పనిసరిగా సకాలంలో హాజరు అవ్వాలని, సీతంపేట ఎంపీడీవో బీబీ మిశ్రో పత్రిక ప్రకటన ద్వారా తెలిపారు.

మన్యంలో సండే సందడి

విశాలాంధ్ర-సీతంపేట : మన్యంలో పర్యాటక ప్రాంతాల్లో సండే సందడిగా చదువరి ప్రాంతాల నుండి వచ్చిన పర్యాటకులు సందర్శించి పిక్నిక్ చేసుకొని సందడిగా గడిపారు. మెట్టుగూడ జలపాతం, ఎన్టీఆర్ అడ్వా%శీ%న్సర్ పార్క్ లో బోట్ షికార్, ఆల్ టైరిన్ వెహికల్ రైడింగ్, గన్ షూటింగ్, చిన్నపిల్లల ఆటపాటలతో సందడిగా గడిపారు. ఆదలి వ్యూ పాయింట్ వద్ద ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ సందర్శకులు మంత్రముగ్ధులయ్యారు. మన్యం ప్రాంతంలో మరిన్ని పర్యాటక ప్రాంతాలు అందుబాటులోకి తీసుకురావడానికి ఐటి డిఏ అధికారులు కృషి చేస్తున్నారు.

శక్తి టీంలు అవగాహన



విశాలాంధ్ర-బెలగాం : పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్.వి మాధవ్ రెడ్డి ఉత్తర్వుల ప్రకారం ఎఎస్పీ, శక్తి టీమ్స్ నోడల్ ఆఫీసర్ మనీషా వంగలరెడ్డి ఆదేశాల మేరకు పార్వతీపురం శక్తి టీమ్ 1%ం%2 పోలీస్ అధికారులు, సిబ్బంది శనివారం పార్వతీపురం పట్టణం బెలగాం లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా ఉన్న గవర్నమెంట్ గర్ల్స్ హాస్టల్, చాకలి బెలగాంలోని గవర్నమెంట్ గర్ల్స్ హాస్టల్ లో ఆదివారంనాడు మహిళలపై నేరాలు %ం% జాగ్రత్తలు హాస్టల్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళలపై నేరాలు అంటే ఈవ్-టీజింగ్, లైంగిక వేధింపులు, దాడులు, గృహహింస, సైబర్ నేరాలు, అక్రమ రవాణా మొదలైనవి ఇవి మహిళల భద్రత, ఆత్మవిశ్వాసం, భవిష్యత్తును ప్రభావితం చేస్తాయన్నారు. చుట్టుపక్కల పరిసరాలపై అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా రాత్రి సమయంలో ఒంటరి ప్రదేశాలకు వెళ్లవద్దని, బయటకు వెళ్లే ముందు హాస్టల్ వార్డెన్/సిబ్బందికి సమాచారం ఇవ్వండని, ఇన్‌టైం నిబంధనలు పాటించండని, సోషల్ మీడియాలో వ్యక్తిగత వివరాలు, ఫోటోలు, ఓటిపిలు, లొకేషన్‌ను పంచుకోవద్దని, అనుమానాస్పద కాల్స్, మెసేజ్‌లు, ఆన్‌లైన్ వేధింపులను బ్లాక్ చేసి రిపోర్ట్ చేయండని, ఏదైనా అసురక్షితంగా అనిపిస్తే వెంటనే సహాయం కోరండని, సురక్షిత రవాణానే ఉపయోగించండని, అపరిచితుల లిఫ్ట్‌లు స్వీకరించవద్దని, స్నేహితులతో అత్యవసర హెల్ప్ లైన్ నంబర్లు 112, 181 షేర్ చేసుకోండని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో శక్తి టీమ్ ఇంచార్జి, ఎఎస్ఐ లెంక శ్రీనివాసరావు, హెడ్ కానిస్టేబుల్ యు. గురుమూర్తి, మహిళా కానిస్టేబుళ్ల రామలక్ష్మి, పద్మ, శక్తి టీం 1&2 టీమ్ పాల్గొన్నారు.

నేడు వాహనాలు వేలం

విశాలాంధ్ర-పార్వతీపురం: ఎక్సైజ్ నేరములలో పట్టుబడిన ద్విచక్ర వాహనములు ఈనెల 15న (నేడు సోమవారం)బహిరంగ వేలం నిర్వహించుటకు ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు నిర్ణయించారని సిఐ ఎస్ శిరీష తెలిపారు. నేడు 11.00 గంటలకు పార్వతీపురంఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో జరుగు వేలంపాటకు ఆసక్తి కలిగిన వారు హాజరు కావలసిందిగా కోరారు.

రేపటి నుంచి ప్రారంభంకానున్న ధనుర్మాస ఉత్సవాలు

విశాలాంధ్ర-సీతానగరం : స్థానిక శ్రీవేణుగోపాలస్వామి లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో రేపటినుంచి ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం కానున్నాయని ఆలయప్రధానఅర్చకులు పీసపాటి శ్రీనివాసాచార్యులు, రామానుజాచార్యులు, టీటీడీ పారాయణకర్త శ్రీనివాసరావులు తెలిపారు. శ్రీవేణుగోపాలస్వామిఆలయంలో ప్రతీయేటా నెలరోజులపాటు ధనుర్మాస ఉత్సవాలను ఘనంగా చేయడం జరుగుతుందన్నారు. ఈనెల 8నఆశీర్వచన పాశురం,24న ధూపంపాశురం, 30న వైకుంఠ ద్వార దర్శనం,31న విశేషపాశురం, జనవరి ఒకటన నవనీత ఉత్సవం,జనవరి 3న దీపారాధన, జనవరి 8నపూలంగిసేవ, జనవరి 11న కూడైరై విశేష ప్రసాద నివేదనం ,జనవరి 14న గోదారంగనాయకుల కళ్యాణంలు జరుగుతాయని తెలిపారు. నెలరోజులు పాటు ఈఉత్సవాల్లో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలన్నారు. ఉదయం సాయంత్రం వేళల్లో ఘనంగా చేయడం జరుగుతుందని, భక్తులు ధనుర్మాసంలో జై శ్రీమన్నారాయణ అంటూ ఒక్కసారైనా గోదాదేవీను దర్శించుకుంటే పూర్వజన్మ పాపాలు తొలగిపోతాయని తెలిపారు.

ఏజెన్సీలో వాహనాలు తనిఖీ

విశాలాంధ్ర-సీతంపేట : మండలం కిట్టాలపాడు జంక్షన్ వద్ద ఆదివారం సబ్ ఇన్స్పెక్టర్ వై. అమ్మానరావు ఆధ్వర్యంలో పోలీసులు ముమ్మరంగా వాహనాలు తనిఖీ లు చేశారు. వాహనదారులు అన్ని ధ్రువపత్రాలు కలిగి ఉండాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని తెలిపారు. మహిళలు భద్రతకు శక్తి యాప్ తప్పనిసరిగా మొబైల్లో డౌన్లోడ్ చేసుకోవాలని తెలిపారు. సైబర్ నేరగాళ్ల వలలో పడకుండా, మోసాలకు గురికాకుండా, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఏజెన్సీలో గంజాయి, గుడుంబా అమ్మకాలు జరిపిన తరలించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని ఎస్ఐ తెలిపారు.